క్లుప్తంగా

వీవీఐటీలో స్పార్క్ చిత్ర బృందం సందడి



పెదకాకాని: యువ నటీనటులు విక్రాంత్, మెహరీన్ హీరో, హీరోయిన్లుగా హీరో విక్రాంత్ స్వీయ దర్శకత్వంలో డేఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న స్పార్క్ చిత్ర బృందం శుక్రవారం నంబూరు వీవీఐటీలో సందడి చేసింది. నవంబరు 17న చిత్రం కాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర హీరో, దర్శకుడు విక్రాంత్ మాట్లాడుతూ ఇప్ప టికే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభించిందని చెప్పారు. మంచి కంటెంట్ ఉన్న ఈ చిత్రం విశేషంగా ఆకట్టుకుంటుదని, తప్పక విజయ సాధిస్తుందనే ఆశాభావం వ్య క్తం చేశారు. విద్యార్థులతో కలసి నృత్యాలు, సె ల్ఫీలతో నటీనటులు సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, చిత్ర నటీనటులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ప్రత్తిపాడు మండల నూతన కార్యవర్గం


వెంకటనారాయణ


చంద్రశేఖర్‌రెడ్డి

ప్రత్తిపాడు: యూ టీఎఫ్ ప్రత్తిపాడు మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా కె. చెన్నకేశవరావు (తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్), మండలాధ్యక్షుడిగా కె. వెంకట నారాయణ (హెచ్‌ఈ పాతమల్లాయపాలెం), మండల ప్రధాన కార్యదర్శిగా జి. చంద్రశేఖర్ రెడ్డి (ఎల్‌ఈ, కొండేపాడు) ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా ఎస్. విజయలక్ష్మి, బి. ఉదయ్‌భాస్కర్, సహ కార్యదర్శులుగా వి. సుజాత, ఎం. సత్యనారాయణ, మహిళా కమిటీ కన్వీనర్‌గా కె. ఉదయలక్ష్మి, కోకన్వీనర్‌గా బి. శైలజాకుమారి, సీపీఎస్ కన్వీనర్‌గా తోట వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కె. మౌలాలి, ఆర్థిక కమిటీ కన్వీనర్‌గా కె. రామకృష్ణ, కార్యదర్శులుగా సీహెచ్. బాజి, ఎం.ఎల్.వి. శ్రీనివాసరావు, ఆర్. కృష్ణకుమారి, టి. పిచ్చయ్య, ఎం. రత్నారావు, సమన్వయకమిటీ కన్వీనర్‌గా ఏ. యోగానందరావు, పత్రికా కమిటీ కన్వీనర్‌గా కె. శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా కె. రామ్మోహనరావు, టి. వినోద, ఎం. నాగేశ్వరరావు, ఎస్. మాధవీలత, కె. శ్రీనివాసరావు, డి. కుసుమకుమార్, కె. శ్రీదేవి, జి. రవికుమార్, గౌరవ సలహాదారుడిగా వి. నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు.

నేడు వెనిగండ్లలో ఉచిత పశు వైద్య శిబిరం

పెదకాకాని: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ లోక్‌నాథ్ తెలిపారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ఉదయం 8 గంటల నుంచి పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో పశు వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు సేవలు అందిస్తారని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్, ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు.

పొన్నూరులో..

మరమ్మతుల కారణంగా పట్టణ, నిడుబ్రోలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన సీఎం జగన్

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- వంద కోట్ల రూపాయలతో చేబ్రోలులో అభివృద్ధి, సంక్షేమ పనులు


సభలో ప్రసంగిస్తున్నఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలు-2 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గత నాలుగున్నరేళ్లలో సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల్ని తెలియజేశారు. చేబ్రోలు-2 పరిధిలో రూ.15,60,81,530 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ చేబ్రోలులోని ఐదు గ్రామ సచివాలయాల పరిధిలో వంద కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. పరిపాలనా విధానాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గడప గడప వద్దకు తీసుకువచ్చినట్లు చెప్పారు. జిల్లాలో అత్యధికంగా అభివృద్ధి పనులు చేసి పొన్నూరు నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో గతానికి, ఇప్పటికి మధ్య తేడాను గమనించాలని సూచించారు. అనంతరం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలోని కొన్ని ఇళ్లకు వెళ్లి మహిళలతో మాట్లాడారు. కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. సాహితి, డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, పార్టీ మండల కన్వీనర్ పెదమస్తాన్, నేతలు కాసు ఈశ్వరరెడ్డి, అప్పిరెడ్డి, విజయ్‌కుమార్, జైలీ, ఆదాం, చౌదయ్య, ఎంపీడీవో బి. బాబూరావు, పంచాయతీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి

గుంటూరు రూరల్: జగనన్నతోనే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు, పార్టీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మండలంలోని చల్లావారిపాలెంలో శుక్రవారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలి ? అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాల్ని అందించిన ఘనత జగనన్నకే దక్కిందని తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పథకాలు ప్రజలకు అంది, సంతోషంగా జీవించాలంటే మరలా మనం జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశాపెట్టారని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, జగనన్న ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్, దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.


చల్లావారిపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు


కాకుమానులో సంక్షేమ పథకాలబోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ షేక్ గుల్జార్ బేగం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కాకుమాను: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం పేర్కొన్నారు. కాకుమాను గ్రామ సచివాలయం-2లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకా వాలంటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారని తెలిపారు.ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల నుంచి రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏ చిన్న పని కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల అనుమతి కావాలని, ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఒక్కటే ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా భావించి రాష్ట్రంలో సుపరిపాలన చేస్తున్న దేశ చరిత్రలో ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.ఈ సందర్భంగా గత నాలుగున్నర సంవత్సరాల నుంచి ప్రభుత్వం అందించిన పథకాలు, అర్హుల వివరాల జాబితాను నేతలు ఆవిష్కరించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమారి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కానుగుల పరమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కొత్త అమేష్, నిడుబ్రోలు సుబ్బారావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు

పొన్నూరు: అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని ములుకుదురు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు, చేసిన వ్యయంతో ప్రదర్శించిన బోర్డును జేసీఎస్ మండల కన్వీనర్ బి. వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభకు సర్పంచ్ కుందుల దుర్గాదేవి అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో ఇప్పటి వరకు రూ. 20కోట్ల 17 లక్షల నగదును బ్యాంకుల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సుమారు రూ. 28 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కందుల సరోజిని, నాయకులు పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో..

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా జెండా చెట్టు 3వ సచివాలయం, 17 సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి అమలు చేసిన పథకాల్ని వివరించి, కరపత్రాల్ని పంపిణీ చేశారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలోని 4,5 డివిజన్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు రూ. 10 కోట్ల 19 లక్షలు లబ్ధి పొందారని, రూ.17 కోట్ల 57 లక్షల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ఎం.ఎ.మహమ్మద్, నాయకులు దాసరి నారాయణరావు, జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, షేక్ గఫార్, షేక్ సుభాని, బద్దులూరి రంగారావు, షేక్ జానీ బాషా, మాజీ కౌన్సిలర్ షర్మిల, అనిల, పలికల శ్యామ్, వలి బాషా పాల్గొన్నారు.


ములకుదురు సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు


పొన్నూరులో సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమం, ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం


నంబూరులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న గుత్తికొండ అంజిరెడ్డి, నేతలు

పెదకాకాని: ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని నియోజకవర్గ పరిశీలకుడు గుత్తికొండ అంజిరెడ్డి తెలిపారు. మండలంలోని నంబూరు సచివాలయం- 2 లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ (రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..) కార్యక్రమాన్ని నిర్వహించారు. పొన్నూరు నియోజకవర్గ పరిశీలకుడు గుత్తికొండ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఇంటికీ ఎంత లబ్ధి చేకూరిందో వివరించాల్సిన బాధ్యత వలంటీర్లు, స్థానిక నాయకులపై ఉందని చెప్పారు. వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరించి, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని సూచించారు. సచివాలయం- 2 పరిధిలో 1524 కుటుంబాలు ఉండగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ. 23,80,46,139 ఖర్చు చేసిందని వెల్లడించారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి విలేజ్ క్లినిక్స్, రైతు భరోసా కేంద్రాలు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో వచ్చిన మార్పుల్ని వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్ని సమర్థంగా అమలు చేస్తున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి ఎంతైనా ఉందని తెలిపారు. ముందుగా సంక్షేమ పథకాల వివరాలతో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జయభారతరెడ్డినగర్‌లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులతో కలసి పార్టీ జెండా ఎగురవేశారు. చివరిగా వలంటీర్లతో కలసి పలు ఇళ్లకు నేతలు వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ఏ విధమైన మేలు జరిగిందో వివరించి, జెండాలు అలంకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జొన్నల అవినాష్‌రెడ్డి, సయ్యద్ సుభాని, భీమవరపు కోటిరెడ్డి, మందాళ శివారెడ్డి, జొన్నల కరుణాకరరెడ్డి, బొంతు శివారెడ్డి, శివాలయం చైర్మన్ ఎ. శివశంకరరావు, కూసం తిరుమలరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి


లాలుపురంలో పర్యటిస్తున్న జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, నేతలు

గుంటూరు రూరల్: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు పేదలకు, ప్రతి కుటుంబానికీ అందాలన్నా మన జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తెలిపారు. ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఇన్‌చార్జి ఎంపీపీ ఇంటూరి పద్మావతి ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దాసుపాలెం సర్పంచ్, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి

- వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- కసుమర్రులో 578 మందికి కళ్లజోళ్లు పంపిణీ


వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం కసుమర్రులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీని శుక్రవారం బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంధత్వ సమస్య నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్రజ్యోతి పేరుతో వైద్య శిబిరాల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాల అనంతరం వైద్య సేవల్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కసుమర్రు, పెద్ద ఇటికంపాడు, వల్లభరావుపాలెం గ్రామాలకు చెందిన 656 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, సమస్య ఉన్నట్లు గుర్తించిన వారందరికీ వారం రోజుల్లోనే 578 మందికి కళ్లజోళ్లను అందించినట్లు ఆయన వెల్లడించారు.

రేపు కొత్తరెడ్డిపాలెంలో నేత్రజ్యోతి వైద్య శిబిరం

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో ఆదివారం బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. నేత్ర సమస్యల నుంచి గ్రామస్తులందరికీ రక్షణ కల్పించడమే వైద్య శిబిరం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లను అందించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 9,795మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 8291మందికి కళ్లజోళ్లను అందించినట్లు ఆయన వెల్లడించారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం

పొన్నూరు: డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మేనేజర్ అజిత కుమారి తెలిపారు. డిపోలో శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోన్ ద్వారా ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులు, సమస్యలు తెలుసుకున్నారు. కాకుమానుకు చెందిన రవి మాట్లాడుతూ రద్దు చేసిన కాకుమాను రెండవ బస్సును పునరుద్ధరించాలని కోరారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పొన్నూరు-గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసులతో పాటు విజయవాడ, సింధనూరు, మంగపేట, భద్రాచలానికి గతంలో తిప్పిన బస్సుల్ని తిరిగి ఏర్పాటు చేయాలని పొన్నూరు నుంచి యాసిన్ కోరారు. పొన్నూరు నుంచి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిపో నుంచి గతంలో తిరిగిన దూర ప్రాంత బస్సుల్ని మరలా పునరుద్ధరించాలని కోరారు. ప్రయాణికుల సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని డిపో మేనేజరు తెలిపారు.

బాస్కెట్ బాల్ టోర్నీకి బయలుదేసిన ఏఎన్‌యూ టీం


ఎంపికైన క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సౌత్ జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ తరపున సత్తా చాటిన ఆర్‌వీఆర్‌జేసీ టీంకు కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్రివేంద్రంలోని కేరళ యూనివర్సిటీలో ఈ నెల 13 నుంచి 18 వరకు జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ 2023-24లో ఆడేందుకు కళాశాల నుంచి బయలుదేరిన క్రీడాకారుల బృందాన్ని ఆయన అభినందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణ ప్రసాద్, ఏఎన్‌యూ బాస్కెట్ బాల్ టీం సెలక్షన్ కమిటీ చైర్మన్ కె. శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ కె .రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి. శ్రీనివాస్, పీడీలు గౌరీశంకర్, సూర్యనారాయణ, ఎం. శివరామకృష్ణ అభినందించిన వారిలో ఉన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి


సర్వసభ్య సమావేశంలో ఉద్యోగులను సన్మానిస్తున్న నేతలు, అధికారులు

చేబ్రోలు: ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చేబ్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి తెలిపారు. చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఎన్నికల ముసాయిదా జాబితా విడుదల అయిందని, డిసెంబర్ 9వ తేదీలోపు అభ్యంతరాల్ని తెలియజేయవచ్చని తెలిపారు. ఓటర్ల మార్పులు, చేర్పులు నిరంతర పక్రియగా పేర్కొన్నారు. మండలంలో వంద శాతం పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందుతోందని చెప్పారు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా పోలీసు, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు. ఏవో శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. సాగునీటి సమస్య లేదన్నారు. సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లోని పెదవడ్లపూడి హైలెవల్ చానల్ కింద సాగులో ఉన్న 50 ఎకరాల్లో కొంత సమస్య ఉందని తెలిపారు. ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, రెండో పంటగా రైతులు తప్పనిసరిగా అపరాలు సాగు చేయాలని ఆయన సూచించారు. నీటి ఎద్దడి దృష్ట్యా రెండో పంటగా జొన్న సాగు చేయవద్దని తెలిపారు. వేజండ్ల ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతులకు తైవాన్ పవర్ స్ప్రేయర్లు అందించాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి ప్రసాద్ మాట్లాడుతూ నాడు - నేడు ద్వారా మండలంలోని 35 పాఠశాలల్ని అభివృద్ధి పరిచి, మౌలిక వసతుల్ని కల్పించినట్లు తెలిపారు. నారాకోడూరు పాఠశాలలో ఆరు లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురవ్వడంతో విద్యార్థులు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కుర్రా పాములు కోరారు. వెంటనే పరిష్కరించనున్నట్లు ఎంఈవో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్ని ఎంపీడీవో బి. బాబూరావు, పంచాయతీరాజ్ ఏఈ వరదరాజులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు వివరించారు. సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులకు సన్మానం

ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను గుర్తించి వెంటనే స్పందించి వైద్యశాలకు తరలించి, ఆమె ప్రాణాలు కాపాడిన ముగ్గురు ఉద్యోగుల్ని చేబ్రోలు మండలాధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ వీఏఏ ప్రవీణ్, మహిళా కానిస్టేబుల్ ఇంటూరి సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ హరిబాబులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కొద్ది రోజుల కిందట గుంటూరుకు చెందిన దంపతులు కుటుంబ సమస్యల కారణంగా కొమ్మమూరు చానల్ నుంచి రెండు కి.మీ. దూరంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. భర్త సాంబశివరావు పురుగుమందు తాగి కొమ్మమూరు చానల్‌లో పడటంతో మరణించాడు. భార్య సుజాత పురుగు మందు తాగి కాలువ కట్టపై నిర్జీవంగా పడి ప్రాణాపాయస్థితిలో ఉంది. ఆమెను ఆస్పత్రికి చేర్చి ప్రాణాల్ని కాపాడిన ముగ్గురు ఉద్యోగుల్ని ఎంపీపీ కె. సాహితి, తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో బి. బాబూరావు, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సర్పంచ్ వినీతారాణి సన్మానించి అభినందించారు.

రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు తప్పనిసరి

పొన్నూరు: కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించే రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రంలో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు సూచించారు. మండలంలోని వడ్డిముక్కల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం తేమ శాతం పరిశీలించి, ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. వ్యవసాయ అధికారి వెంకట్రామయ్య మాట్లాడుతూ కౌలుదారులందరికీ బ్యాంకు ద్వారా పంట రుణం ఇప్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో 38 గ్రూపుల ద్వారా కోటి 69 లక్షల రూపాయలు, వ్యక్తిగతంగా 53 మంది రైతులకు రూ. 35 లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడితే రుణం ఇప్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతును అడ్డగించి నగదు అపహరణ

చేబ్రోలు: ఎరువుల కొనుగోలు కోసం వెళ్తున్న రైతును గుర్తు తెలియని వ్యక్తి అడ్డగించి మాయమాటలు చెప్పిన నగదు అపహరించుకుపోయిన సంఘటన చేబ్రోలు మండలం గుండవరం గ్రామ పరిధిలో శుక్రవారం జరిగింది. మండల పరిధిలోని గొడవర్రుకు చెందిన రైతు ఆరాధ్యుల నాగేశ్వరరావు నారాకోడూరులో ఎరువులు కొనుగోలు చేయడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గంమధ్యలో గుండవరం గ్రామ పరిధి మెయిన్ రోడ్డులోని మలుపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి నిలుపదల చేసి, మాయమాటలు చెప్పాడు. రైతు నాగేశ్వరరావు వద్ద ఉన్న ఐదు వేల రూపాయల్ని లాక్కొని పరారయ్యాడు. జరిగిన సంఘటనపై బాధితుడు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.